నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 10 మే 2024 | VIKARABAD

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

– కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి

ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి నన్ను ఆశీర్వదించాలి. కేసీఆర్ పదేండ్ల కాలంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేశారు. ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందాయి. కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు అనూహ్య స్పందన వస్తున్నది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నది. ప్రజలు ఏ ప్రభుత్వం ఉంటే మంచి జరిగిందో గమనించాలి. నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా. రాష్ట్రానికి రావాల్సిన నిధులపైనా పోరాటం చేస్తా.

- అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన
- కేసీఆర్ ప్రాజెక్టులు కట్టి తెలంగాణను పచ్చగా మార్చితే.. కాంగ్రెసోళ్లు పశువులకూ తాగేందుకు నీరు లేని దుస్థితిని తెచ్చారు..
- పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వని బీజేపీ
- వికారాబాద్ జిల్లా రద్దు కావొద్దంటే బీఆర్ఎస్ అభ్యర్థి కాసానిని గెలిపించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- వికారాబాద్ మండల, పట్టణ కార్యకర్తల మీటింగ్.. గండీడ్ మండలంలోని దేశాయిపల్లి లో ప్రజాశీర్వాద సభ

పోలింగ్‌కు 48 గంటల ముందు
బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మే 9 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటలకు ముందు ప్రచారంపై నిషేధం అమలులో ఉంటుందని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైలెన్స్ పీరియడ్‌లో భాగంగా ఈ నెల 11న సాయంత్రం 6 నుంచి 13న సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే బల్క్ ఎస్ఎంఎస్‌లను నిశితంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినవారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళిననుసరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఎస్ఎంఎస్‌లను పంపడానికయ్యే ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

వికారాబాద్ మండల, పట్టణ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

రద్దు చేస్తే రణమే..

కాంగ్రెస్ కొత్త జిల్లాల రద్దు వ్యాఖ్యలపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

- మరో ఉద్యమానికి సిద్ధమంటున్న వికారాబాద్ జిల్లా ప్రజానీకం
- ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కేసీఆర్
- జిల్లా రద్దయితే పరిస్థితి మళ్లీ మొదటికే.. అటకెక్కనున్న అభివృద్ధి
- పడిపోనున్న భూముల ధరలు.. పతనంకానున్న రియల్ ఎస్టేట్..

కాంగ్రెస్‌కు ఓటేస్తే వికారాబాద్ జిల్లా రద్దే..

వికారాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు ఓటేస్తే వికారాబాద్ జిల్లా ఉండదని..కాంగ్రెస్ ఐదు నెలల పాలన అస్తవ్యస్తంగా మారిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇందారెడ్డి అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో వికారాబాద్ మండల, పట్టణ కార్యకర్తల మీటింగ్.. అదేవిధంగా గండీడ్ మండలంలోని దేశాయిపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న పల్లవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉమ్మడి గండీడ్ మహ్మదాబాద్ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రజాశీర్వాద సభకు ఆమె చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన వికారాబాద్ జిల్లా రద్దు కాకుండా ఉండాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణు లకు సూచించారు. కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణను పచ్చగా మారిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మనుషులకే కాదు కనీసం పశువులకు కూడా నీరు దొరకని పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. పదేండ్ల కిందట బావుల వద్దకెళ్లి తాగునీరు తెచ్చుకునే సందర్భంలో.. కేసీఆర్ సీఎం అయిన తర్వాత మిషన్ భగీరథతో తెలంగాణ అంతటా ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించారని కొనియాడారు. కాంగ్రెసోళ్లు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని, 48 లక్షల మందికి ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ అందిస్తున్నామని చెబుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఆరు గ్యారెంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక్కటే అమలు చేసి డబ్బా కొట్టుకుంటున్నారని, ఆ పథకంలోనూ ఆడవాళ్లు కనపడితే బస్సు ఆపకుండా పోయే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకూ రూ.2500 చొప్పున ఇస్తామన్నారు.. ఇప్పటికీ ఒక్కరికీ ఇవ్వకుండానే ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ తెలంగాణ అంతటా మహిళలకు రూ.2500 పంపిణీ చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోయాయి, నీళ్లు వదలాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడిగే వరకూ సోయిలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఐదు నెలలు దాటినా ఇప్పటికీ ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. తెలంగాణ అభివృద్ధికి కృషి చేయని బీజేపీకి ఓటేయొద్దని.. వారు ఇచ్చే అక్షింతలు తీసుకొని దేవుడి ముందు నిల్చొని తలపై వేసుకొని కారు గుర్తుకు ఓటేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు బీజేపీ జాతీయ హోదా ప్రకటించలేదని, ప్రజలను మోసం చేసి సీఎం అయిన రేవంత్‌రెడ్డి ఐదు నెల ల్లో పాలమూరు ప్రాజెక్టుకు సంబంధించి ఎక్కడా కూడా ప్రస్తావించలేదని మండిప డ్డారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో కేసీఆర్ ముందుంచారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను తన మొబైల్ ఫోన్‌లో ఉన్న వీడియోలను ప్రజలకు చూపించి.. ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయలేదని మండిపడ్డారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని అంటున్నారని.. అప్పుడు సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు వచ్చి కోడ్ అమల్లో ఉందని దాటవేసే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, జిల్లా ఇన్ చార్జి గట్టు రాంచందర్ రావు, వికారాబాద్, గండీడ్ మండలాల ఎంపీపీలు చంద్ర కళ, మాధవి, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతి, మాజీ ఎంపీపీ అనురాధ, మాజీ జడ్పీటీసీ లక్ష్మమ్మ, సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు గోపాల్, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, కృష్ణ, కృష్ణారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, నీలేశ్, సూర్యనాయక్, రాజ్ కుమార్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంటకయ్య, రాజు, అశోక్‌గౌడ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి,రాజేశ్వర్, రాజు, గఫార్, కేశవులు, మాణిక్యం పాల్గొన్నారు.

జిల్లాను రద్దు చేస్తే మళ్లీ ఉద్యమమే..

– మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యే వికారాబాద్

50 ఏండ్లు కొట్లాడి తెచ్చుకున్న జిల్లాను పొగొట్టుకోం. జిల్లాను రద్దు చేస్తే మళ్లీ ఉద్యమం మొదలవుతుంది. మాజీ సీఎం కేసీఆర్ పుణ్యాన వికారాబాద్ జిల్లా ఏర్పాటైంది. ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కారమవుతున్నది. కాంగ్రెస్ అబద్ధపు హామీలను నమ్మి మోసపోయి..గోసపడుతున్నాం. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లే కాదు, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లనూ ఎత్తివేస్తామని బీజేపీ నాయకులే చెబుతున్నారు. ప్రజలకు అండగా ఉంటే బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలి. అందుకు ఈ ఎన్నికల్లో కాసానికి భారీ మెజార్టీ ఇవ్వాలి.

కాసానిని గెలిపించి మన సత్తా చూపుదాం..

– స్వామిగౌడ్, మాజీ శాసనమండలి చైర్మన్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీ బిడ్డకు చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వడం హర్షణీయం. బీసీలంతా పార్టీలకతీతంగా.. గుర్తులతో సంబంధం లేకుండా ఏకమై కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నది. కేసీఆర్ బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చారు. కొన్నేండ్ల తర్వాత బీసీ బిడ్డకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

వికారాబాద్ : సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

-కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే

అసెంబ్లీ ఎన్నికల్లో అలవి కాని హామీలిచ్చి, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ఐదు నెలల కాలంలో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందిపడుతున్నారు. సమస్యల పరిష్కారంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. తాగునీరు అందక మహిళలు, కరెంట్ సక్రమంగా లేక పంటలు ఎండి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ హయాంలో సక్రమంగా అమలైన రైతుబంధు నిధులను కూడా ఈ ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేయడంలేదు. అన్ని వర్గా ల వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు తెచ్చుకున్నామా అని బాధపడుతున్నారు. అందువల్ల మరోసారి తప్పు చేయకుండా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి ఓటు వేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. స్వార్థం కోసం పార్టీలు మారిన వారికి తగిన బుద్ధి చెప్పాలి.

–మహ్మదాబాద్/గండీడ్

వికారాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : కొత్త జిల్లాలను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎన్నో ఏండ్ల ఆకాంక్ష ప్రత్యేక వికారాబాద్ జిల్లా ఏర్పాటును బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నెరవేర్చితే.. కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసే దిశగా ఆలోచన చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే ఈ ప్రయత్నాన్ని విరమించుకోకపోతే మరోసారి ఉద్యమించేందుకూ వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. చిన్న జిల్లాలతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించిన కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే వికారాబాద్ జిల్లా ప్రజల కల నెరవేరింది. ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతుండడం తోపాటు రూ.వేల కోట్లతో అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నది. అంతేకాకుండా కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటతో ప్రజలకు పాలనను మరింత చేరువైంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకోగా.. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణంతో పాలన ప్రజల ముంగిటకు చేరింది.

రద్దుతో రంబీ తప్పదు..

వికారాబాద్ జిల్లా రద్దుతో పరిస్థితి మళ్లీ మొదటికి రానున్నది. ప్రజలకు చేరువైన పాలన దూరం కానున్నది. ముఖ్యంగా అభివృద్ధి అటకెక్కనున్నది. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగనున్నది. ఏ చిన్న పనికైనా నగరంలోని కలెక్టరేట్‌కే వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడనున్నది. జిల్లా యంత్రాగం కోసం రూ.కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిరుపయోగంగా మారనున్నది. రియల్ రంగం కుదేలై భూముల ధరలు ఒక్కసారిగా పడిపోనున్నాయి.

గతంలో ఎన్ని బాధలంటే..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ ప్రాంత ప్రజల బాధలు వర్ణనాతీతం. ఆయా శాఖల జిల్లా అధికారులను కలిసి తమ సమస్యలు విన్నవించాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇక తాండూరు నియోజకవర్గ ప్రజలైతే వంద కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వచ్చేది. వ్యయప్రయాసల దృష్ట్యా నిత్యం నగరానికి వెళ్లలేక కేవలం సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరై ప్రజలు తమ సమస్యలను విన్నవించుకునేవారు. తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల ప్రజలు అన్ని పనులు మానుకొని ఉదయం 6 గంటలకు బయలుదేరితే గానీ ప్రజావాణి ముగిసే సమయంలోపు వెళ్లేవారు. మళ్లీ తిరుగు ప్రయాణమై రాత్రికి ఇంటికి చేరుకునే పరిస్థితి ఉండేది. ఒక్కోసారి కలెక్టరేట్‌కు వెళ్లే సమయానికి ప్రజావాణి కార్యక్రమం ముగిసిన పరిస్థితులు కూడా ఉన్నాయని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

కొత్త జిల్లాతో తీరిన సమస్యలు..

సమస్యలను గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి వికారాబాద్ జిల్లాను ఏర్పాటు చేశారు. రూ.60 కోట్లతో 33 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను నిర్మించి అన్ని శాఖలను ఒకే చోట ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రజలకు పాలనను మరింత చేరువైంది. ప్రభుత్వం అమలుచేస్తున్న పలు కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో అందుతున్నాయి. ఆయా విభాగాల అధికారులందరూ నిత్యం క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ నెల, రెండు నెలలకోసారి మాత్రమే క్షేత్రస్థాయిలో పర్యటించేవారు.. జిల్లా ఏర్పాటుతో ప్రస్తుతం నిత్యం ఏదో ఒక కార్యక్రమం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన తప్పనిసరిగా మారింది.

ప్రగతి దిశగా పరుగులు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని వికారాబాద్ ప్రాంతం జిల్లాగా ఏర్పాటైన అనంతరం ప్రగతి దిశగా పరుగులు పెడుతున్నది. కేసీఆర్ ప్రత్యేక చొరవతో రూ.వేల కోట్ల నిధులతో వికారాబాద్ జిల్లాను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లారు. పెద్ద ఎత్తున పరిశ్రమలను నెలకొల్పడం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ, ప్రభుత్వ ఆయుష్ కాలేజీ, మాతాశిశు దవాఖాన, చెరువుల పూడికతీత, ఇంటింటికీ తాగునీరు, రహదారుల విస్తరణ, సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం తదితర ప్రగతి పనులు చేపట్టి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారు. దీంతో రియల్ రంగం పుంజుకున్నది. జిల్లా ఏర్పాటుకు ముందు కొడంగల్‌లో ఎకరం భూమి కేవలం రూ.2 లక్షలుండగా.. ప్రత్యేక జిల్లా ఏర్పాటు అనంతరం ఎకరం భూమి ధర రూ.కోట్లకు పడుగలెత్తింది. జిల్లా కేంద్రంలోనూ రూ.10 లక్షలకు ఎకరం ఉన్న భూముల ధరలు ఒక్కసారిగా రూ.4 కోట్లకు ఎగబాకింది.

కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో ఆందోళన..

కొత్త జిల్లాల రద్దుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ తీరుపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాను రద్దు చేస్తే మళ్లీ కష్టాలు మొదలైనట్లేనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారెంటీలంటే నమ్మి ఓటేసిన ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్నదని వాపోతున్నారు. ఎన్నో ఏండ్లుగా ఉద్యమించి సాధించిన జిల్లాను రద్దు చేసే ఆలోచన చేస్తుండడం కాంగ్రెస్‌కు తగదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతామని వికారాబాద్ జిల్లా ప్రజలు హెచ్చరిస్తున్నారు.

పాలన కుంటుబడుతుంది

కొత్త జిల్లాలను రద్దు చేస్తే పాలన కుంటుబడుతుంది. చాలా ఏండ్లుగా గ్రామాల్లో పరిపాలన సక్రమంగా లేదని భావించిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రజల సౌకర్యార్థం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. గతంలో 50-60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. రెండు, మూడు రోజుల వరకు తిరగాల్సి వచ్చేది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాన్ని ఒకే ప్రాంతంలో నిర్మించారు. అవసరమైన పనులను ప్రభుత్వ కార్యాలయాలకెళ్లి తక్కువ సమయంలో పూర్తి చేసుకుని వస్తున్నారు. దీంతో ప్రజల కు సమయంతోపాటు డబ్బు కూడా ఆదా అవుతున్నది.

- ఘణాపురం రాములు, పాంబండ ఆలయ మాజీ చైర్మన్ బండవెల్మిచర్ల, కులకచర్ల

జిల్లాల రద్దుతో అభివృద్ధికి విఘాతం..

స్వరాష్ట్రం ఏర్పడ్డాక చేసిన కొత్త జిల్లాలను రద్దు చేస్తే ప్రజలకు మునుపటి కష్టాలు మళ్లీ వస్తాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి వైపు పరుగులు పెట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డి కొత్త జిల్లాలను రద్దు చేస్తామని పేర్కొనడం తగదు. జిల్లాల రద్దుతో ఉద్యోగులు, నిరుద్యోగులు, సామాన్యులకు సైతం ఇబ్బందులు తలెత్తుతాయి. చిన్న కుటుంబం చింతలేని కుటుంబంలా కేసీఆర్ చక్కటి విజన్‌తో ఏర్పాటు చేసిన నూత న జిల్లాలపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడం తగదు.

-సజిత, తాండూరు

కొత్త జిల్లాలు ఉండాల్సిందే

పాలనా సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు ఉండాల్సిందే. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తామనడం సమంజసం కాదు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పాలనా పరంగా ఎం తో అనుకూలంగా ఉన్నాయి. కొత్త జిల్లా కేంద్రాల్లో కోట్ల రూపాయలతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా కలెక్టరేట్లను నిర్మించారు. జిల్లాలను రద్దు చేస్తే మళ్లీ ప్రజలకు ఇబ్బందులు షురూ అవుతాయి. పాలన గందరగోళంగా మారుతుంది.

-బుస్స చంద్రయ్య, సీఐటీయూ నాయకుడు, దుద్యాల

ప్రభుత్వ నిర్ణయం బాధాకరం..

కొత్త జిల్లాలను రద్దు చేసి పాత జిల్లాల ప్రకారం పాలన సాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరం. కొత్త జిల్లాలను రద్దు చేస్తే మరో తుగ్లక్ పాలనను తలపించినట్లే. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సుస్థిర, సౌలభ్యకర పాలనను అందించాలనే సంకల్పంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా సమీకృత కలెక్టరేట్లను నిర్మించి.. ప్రజలకు పాలనను చేరవ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ప్రజాభిప్రాయాన్ని సేకరించకుండా కొత్త జిల్లాలను రద్దు చేస్తామనడం మంచిదికాదు.

- రామన్న మాదిగ, తెలంగాణ ఉద్యమకారుడు, గుండాల, దోమ

రేవంత్‌కు పాలనపై పట్టేలేదు..

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి.. కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నాడు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎన్నికల ఇన్‌చార్జి బాల్‌రాజ్‌యాదవ్

షాద్‌నగర్, మే 9 : రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టేలేదని.. ప్రజా సంక్షేమాన్ని గాలి కొది లేసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాడని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎన్నికల ఇన్‌చార్జి దూదిమెట్ల బాల్‌రాజ్ మండిపడ్డారు. గురువారం కేశంపేట మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు ఎన్ని మోసపూరిత హామీలిచ్చి మభ్యపెట్టాలని చూసినా.. పాలమూరు గడ్డపై ఎగిరేది గులాబీ జెండానేనని ధీమా వ్యక్తం చేశారు. అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టేలేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా ఒక్క ఉద్యోగ ప్రకటనను జారీ చేయలేదని.. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని ఆరోపించారు. పాలమూరు అభివృద్ధికి పైసా ఇవ్వని బీజేపీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ఆ పార్టీకి ఓటు అడిగే హక్కే లేదన్నారు. అబద్ధాలను ప్రచారం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. మహిళలు, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలిచే బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపి కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి. పక్కన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

హాజరైన జనం..